క్లుప్తంగా

నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నాగరాజు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నిబంధనల ప్రకారమే నిర్మించుకోవాలని మున్సిపాలిటీ కమిషనర్ బి.నాగరాజు అన్నారు. బుధవారు స్థానిక కార్యాలయం వద్ద లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల నిర్మాణాలు చేస్తే బిల్లుల చెల్లింపులు నిలిచిపోతాయని స్పష్టం చేశారు. మంజూరైన వారంతా ఇళ్ల నిర్మాణాలను మొదలు పెట్టాలని అన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈఈ రాము, కాంగ్రెస్ నాయకుడు జూపల్లి ప్రమోద్, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానిత వ్యక్తుల సమాచారం ఇవ్వండి



దేవళ్లగూడెంలో కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమం నిర్వహిస్తున్న పోలీసులు

గుండాల: గిరిజన గ్రామాల్లోకి ఎవరైన అనుమానిత వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆళ్లపల్లి, గుండాల ఎస్సైలు సోమేశ్వర్, సైదా రహూఫ్ అన్నారు. గుండాల మండలంలో దేవళ్లగూడెంలో, ఆళ్లపల్లి మండలం బోడాయి కుంట గ్రామాల్లో పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జనజీవన స్రవంతిలో కలిసిన మావోలకు పోలీస్ శాఖ నుంచి సహకారం అందిస్తామన్నారు.

రేగా నర్సమ్మకు నివాళి

మణుగూరురూరల్: బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మాతృమూర్తి రేగా నర్సమ్మ బుధవారం మృతి చెందగా.. విషయం తెలుసుకున్న మణుగూరు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు కుంటా లక్ష్మణ్‌లు నివాళులర్పించారు. కరకగూడెంలోని వారి స్వగృహానికి చేరుకుని రేగా నర్సమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు. సంతాపం తెలిపిన వారిలో బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి నూకారపు రమేష్, నాయకులు వట్టం రాంబాబు, బీసి సెల్ మండల అధ్యక్షుడు ఆవుల నర్సింహరావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు వేర్పుల నరేష్ తదితరులున్నారు.

మల్లెల వారి గుంపులో పాఠశాల ఏర్పాటు



తాత్కాలిక పాఠశాలను ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

గుండాల: మండల పరిధిలోని మండలంలోని సాయనపల్లి పంచాయతీ మల్లెల వారి గుంపు గ్రామంలో బుధవారం ఎంఈఓ పార్వతమ్మ ఆధ్వర్యంలో నూతనంగా మంజూరైన పాఠశాలను ప్రారంభించారు. ఇప్పటి వరకు ఇక్కడి విద్యార్థులు పక్కనే ఉన్న చిన్నవెంకటాపురం గ్రామానికి ప్రతీ రోజు వెళ్లేవారు. ప్రస్తుతం తాత్కాలిక పూరిగుడెసెలో పాఠశాల నిర్వాహణ జరుగుతుందని, నిధులు మంజూరు అయితే పక్కా పాఠశాల భవన నిర్మాణం చేపడుతామని ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీ విజయ, చుక్కయ్య, ఉపాధ్యాయులు నర్సింహరావు, లక్ష్మణ్, వీరస్వామి పాల్గొన్నారు.

చెవిలో పూలతో నిరసన

దమ్మపేట: దమ్మపేట బస్టాండ్‌లో పెట్రోల్ బంక్ నిర్మాణాన్ని ఆపేయాలని డిమాండ్ చేస్తూ స్థానికులు చెవిలో పూలతో నిరసన వ్యక్తం చేశారు. బుధవారం స్థానికులు బస్టాండ్ ముందర రిలే నిరాహార దీక్షలను పదో రోజు కొనసాగించారు. సున్నం శ్రీను, రహీమ్, రొయ్యల బాబురావు, రవి, వలీ, సూర్యనారాయణ, చిరంజీవి, అనిల్ పాల్గొన్నారు.

ఉద్యోగిపై దాడి అమానుషం

ములకలపల్లి: కోర్టు ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విచారణకు వెళ్లిన జోగులాంబ జిల్లా, గద్వాల మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ (గిర్దావార్) రామకృష్ణపై దాడి చేయడం అమానుషమని తెలంగాణా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) జిల్లా అధ్యక్షుడు బాదావత్ భద్రు అన్నారు. దాడి కారకులపై చర్యలు తీసుకోవాలని ఓ ప్రకటనలో కోరారు.

కదం తొక్కిన కార్మిక లోకం

కార్మికుల హక్కులను కాలరాసేందుకు కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయలనే డిమాండ్‌తో.. అఖిలపక్ష కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె బుధవారం విజయవంతమైంది. వివిధ రంగాల్లోని కార్మికులు స్వచ్ఛందంగా పనులు విరమించారు. రోడ్లెక్కి ర్యాలీలు తీస్తూ నిరసన వ్యక్తం చేశారు. పలు ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టారు. పలుచోట్ల వాణిజ్య, వ్యాపార సముదాయాలు, పాఠశాలలు మూతబడ్డాయి. సింగరేణి, బీటీపీఎస్, ఆర్టీసీ తదితర కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



మణుగూరుటౌన్: సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



ములకలపల్లిలో ప్రదర్శన చేస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాలు..



భద్రాచలంఅర్బన్: విద్యుత్ కార్యాలయం వద్ద విద్యుత్ శాఖ ఉద్యోగులు, ఆర్టిజన్ల నిరసన..



మణుగూరుటౌన్: ఆర్టీసీ బస్సుల బంద్ నేపథ్యంలో బస్సుల కోసం ప్రయాణికుల ఎదురుచూపులు..



మణుగూరురూరల్: ధర్నా నిర్వహిస్తున్న బీటీపీఎస్ ఉద్యోగులు



దుమ్ముగూడెం: ప్రదర్శన నిర్వహిస్తున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు



అశ్వారావుపేటరూరల్: ఆఫ్‌టైప్ పామాయిల్ మొక్కతో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు



బూర్గంపాడు: సారపాకలో..



దమ్మపేటలో వామపక్ష పార్టీల ర్యాలీ..



చర్లలో కార్మిక సంఘాల ప్రదర్శన



గుండాల: ఆళ్లపల్లిలో ర్యాలీ..



కరకగూడెంలో ప్రదర్శన నిర్వహిస్తూ..



చంద్రుగొండ ప్రధాన సెంటర్‌లో..

అవకతవకలకు పాల్పడితే చర్యలు



ఉపాధిహామీ పనుల వివరాలను వెల్లడిస్తున్న తనిఖీ బృందం

గుండాల: గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో సిబ్బంది అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని, నగదు రికవరీ చేస్తామని డీఆర్‌డీఏ పీడీ రవి అన్నారు. ఆళ్లపల్లి మండలంలో జరిగిన ఉపాధి హామి పనుల్లో భాగంగా గత వారం రోజులుగా సామాజిక తనిఖీ బృందం సర్వే, గ్రామ సభలు నిర్వహించారు. దీనిలో భాగంగా బుధవారం రైతు వేదికలో సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. గతం నుంచి పెండింగ్‌లో ఉన్న, ప్రస్తుతం వచ్చిన అవకతవకలలో నగదును రికవరీ చేసి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనిఖీ బృందం 12 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులు, అవకతవకలను వివరించారు. పని చేసిన వారికి కేవైసీ సమస్య వలన కూలీలకు డబ్బులు చెల్లించలేక పోవడంతో వారు నష్టపోయారని తెలిపారు. పనులకు సంబంధించి రికార్డులు మెయింటెన్స్ చేయడం లేదని, పని జరిగిన ప్రదేశాలలో నేమ్ బోర్డులు ఏర్పాటు చేయలేదని గుర్తించినట్లు వెల్లడించారు. ఇకపై క్షేత్ర స్థాయిలో పని ప్రదేశాలను ఎంపీడీఓతో సహా టీఏ, ఎఫ్ఏ, ఏపీఓలు విజిట్ చేస్తుండాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ ప్రసాదరావు, ఏపీఓ రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిల్టర్ బెడ్‌లో బురద తొలగింపు

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలోని కమలాపురం ఫిల్టర్‌బెడ్‌లో పేరుకుపోయిన బురదను తొలిగిస్తున్న నేపథ్యంలో రెండు రోజుల పాటు తాగునీటికి అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. బుధవారం సిబ్బంది ఫిల్టర్‌బెడ్‌లో పేరుకుపోయిన బురదను తొలిగించడం ప్రారంభించారు. వానకాలం వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి



భద్రాచలంటౌన్: సమావేశంలో మాట్లాడుతున్న బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానానికి చెందిన భూములను రక్షించేందుకు వెళ్లిన ఈఓ రమాదేవిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి అన్నారు. పట్టణంలోని రాఘవ నిలయం(రెడ్డి సత్రం)లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది కేవలం ఓ ఉద్యోగిపై దాడి కాదని, భక్తుల విశ్వాసంపై దాడని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ కుంజా ధర్మా, పసుమర్తి సతీష్, నిడదవోలు నాగబాబు, ముత్యాలు శ్రీనివాస్, ములిశెట్టి రాంమోహన్ రావు, దేవరపల్లి వెంకటేశ్వర్లు, బోడా సత్యనారాయణ, చెల్లుబోయిన వెంకన్న, ముత్యాలు చంద్ర శేఖర్, వెంకటరెడ్డి, సాయి శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

చర్ల: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ భూములను పరిరక్షించే క్రమంలో ఆంధ్రలోని పురుషోత్తంపట్నంకు వెళ్లిన అధికారులు, సిబ్బందిపై దాడులు చేయడం హేయమైన చర్య అని బీజేపీ చర్ల మండల అధ్యక్షుడు నూపా రమేష్ అన్నారు. బుధవారం చర్లలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయ భూములకు రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఇర్పా సుబ్బారావు, నాయకులు ముత్తవరపు శ్రీనివాసాచారి, విశ్వనాథం, పాహీం తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈఓ రమాదేవిపై దాడి చేయడాన్ని స్థానిక బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం సిబ్బంది ఖండించింది. ఈ సందర్భంగా వారు నిరసన తెలిపారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో ఆలయ ఇన్‌చార్జ్ మేనేజర్ పీవీ రమణ, సిబ్బంది పి.ప్రసాదచార్యులు, వి.రామారావు, వి.సత్యనారాయణశర్మ, బి.రామ్‌సింగ్ పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓలు



దుమ్ముగూడెం: నూతన ఎంపీడీఓకు అభినందనలు తెలుపుతున్న అధికారులు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండల నూతన ఎంపీడీఓగా నంబూరి వివేకరామ్ బుదవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీఓను ఎంపిఓ బద్ది రామకృష్ణ, కార్యాలయ సిబ్బంది సాయిబాబు, శ్రావణి,పంచాయతీ కార్యదర్శులు కలిసి అభినందనలు తెలియజేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎంపీడీఓను మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ,కాంగ్రెస్ నాయకులు లంకా శ్రీనివాసరావులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. వారితోపాటు కాంగ్రెస్ నాయకులు కుంజా శ్రీనివాసరావు, కోడి చంటి, పొడియం సుబ్బారావు, మోతుకూరి శ్రీకాంత్, బొల్లి శేఖర్, నరేంద్ర, కొర్సా సీతారాములు, పిలక వెంకటరమణారెడ్డి, కొమ్ము రంజిత్ తదితరులు ఉన్నారు.

అశ్వాపురం ఎంపీడీఓగా రవీంద్రప్రసాద్..

అశ్వాపురం: మండల నూతన ఎంపీడీఓగా జి.రవీంద్రప్రసాద్ బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎంపీడీఓగా విధులు నిర్వర్తించిన వరప్రసాద్ ఉద్యోగ విరమణ పొందగా.. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడం మండల ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తున్న రవీంద్రప్రసాద్‌ను అశ్వాపురం ఎంపీడీఓగా బదిలీ చేయగా బాధ్యతలు చేపట్టారు. నూతన ఎంపీడీఓ రవీంద్రప్రసాద్‌ను ఎంపీఓ ముత్యాలరావు, యూడీసీ పద్మావతి, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అశ్వారావుపేట ఎంపీడీఓగా అప్పారావు..

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట నూతన ఎంపీడీఓగా బి.అప్పారావు బుధవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓను అశ్వారావుపేట ప్రత్యేకాధికారి డాక్టర్ ప్రదీప్‌కుమార్, ఈజీఎస్ ఏపీఓ రామచంద్రరావుతోపాటు సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షిప్తంగా..

విద్యార్థులకు వితరణ



విద్యార్థులకు బూట్లు అందజేస్తున్న ఉపాధ్యాయులు

చంద్రుగొండ: మండలంలోని గానుగపాడు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు బూట్లు, సాక్సులను బుధవారం వితరణ చేశారు. రూ.20 వేలు విలువ చేసే బూట్లు, సాక్సులను ఉపాధ్యాయులు తమ సొంత ఖర్చులతో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మెన్ చెవులు చందర్‌రావు, విద్యాకమిటి చైర్మెన్ గడిదేశి వనజ, ఉపాధ్యాయులు బి.రాంచందర్‌రావు, డి.సూర్యం గ్రామస్తులు పాల్గొన్నారు.

బోరు నిర్మాణానికి..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఆసుపాక గ్రామంలోగల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన వేముల సుబ్బారావు పెద్ద మనవడు, మనవరాలైన వేముల రాము, విజయ(అమెరికా) బోరు నిర్మాణానికి రూ.40వేలు వితరణగా చేశారు. దీంతో స్థానిక మాజీ సర్పంచ్ కునసోతు లింగయ్య చేతుల మీదుగా బోరు నిర్మాణ పనులను ప్రారంభించారు. కాగా, మోటారు ఇతర ఖర్చులను గ్రామస్తుల నుంచి సేకరించి ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయలక్ష్మి, మాజీ ఎంపీటీసీ విజయలక్ష్మి, కాంగ్రెస్ గ్రామ నాయకులు కరీం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలకు బియ్యం..

మణుగూరురూరల్: మండలంలోని సంతోష్‌నగర్‌లో గల శ్రీవిద్యాభ్యాస(బాలవెలుగు) పాఠశాలకు సత్తుపల్లికి చెందిన ఎం.మమత-శివకుమార్ దంపతులు వారి కుమారుడు జ్ఞానేశ్వర్ రాజ్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం 50కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ వితరణను ఉద్యోగిణి రజిని ఆధ్వర్యంలో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టరేట్ కార్యాలయ డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారిణి విజయలక్ష్మి పండిట్ చేతుల మీదుగా అందించారు. అనంతరం విద్యార్థులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. సింగరేణి సేవా సమితి సభ్యులు నాసర్‌పాషా, సామాజిక సేవకురాలు నాగుల జ్యోతి, నిర్వాహకురాలు బి.జగన్మోహన్‌రెడ్డి, కిరణ్, సిబ్బంది రాధ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

భద్రాచలంటౌన్: ఆధార్ నమోదు కేంద్రాలను జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో ఏర్పాటు చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ అన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రానికి మారుమూల ఆదివాసీలు చిన్న పిల్లతో రావాల్సి వస్తోందని అన్నారు. మండలాల వారిగా కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.